సాక్షి
ఖమ్మం
మంగళవారం । 16 । మే । 2023



నేటి నుంచి 'దోస్త్' రిజిస్ట్రేషన్లు

డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి 'దోస్త్' రిజిస్ట్రేషన్ల మొదటి విడత ప్రక్రియ మంగళవారం నుంచి మొదలవుతోంది. 10లో



తిరోగమనం దిశగా బీజేపీ

దేశవ్యాప్తంగా బీజేపీ తిరోగమనం మొదలైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. 10లో

గరిష్టం / కనిష్టం
43° / 27°

వాతావరణం

జిల్లాలో మంగళవారం ఉదయం నుంచే ఎండ ప్రభావం మొదలవుతుంది. మధ్యాహ్నం వడగాలుల ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

రేపు పాలిసెట్

- నిమిషం నిబంధన అమలు

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలు కల్పించేందుకు ఈనెల 17వ తేదీన పాలిసెట్(పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్టు) నిర్వహించనున్నారు. ఈమేరకు ఏర్పాట్లు పూర్తయ్యాయని పరీక్షల జిల్లా కోఆర్డినేటర్ మహ్మద్ జకీరుల్లా తెలిపారు. జిల్లాలోని ఆరు పరీక్ష కేంద్రాల్లో 2,604మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతారని పేర్కొన్నారు. పరీక్ష ఉదయం 11నుంచి మధ్యాహ్నం 1–30గంటల వరకు జరగనుండగా అభ్యర్థులను ఉదయం 10గంటల నుంచే కేంద్రాల్లోకి అనుమతిస్తామని తెలిపారు. నిమిషం నిబంధన అమల్లో ఉన్నందున 11గంటల తర్వాత అనుమతించేది లేదని స్పష్టం చేశారు. విద్యార్థులు తమ వెంట హెచ్‌బీ పెన్సిల్, రబ్బర్, బ్లూ లేదా బాల్ పెన్ను తెచ్చుకోవాలని, హాల్‌టికెట్‌పై ఫొటో ప్రింట్ కాని వారు ఒక పాస్‌పోర్టు సైజ్ ఫొటో, ఆధార్‌కార్డు తీసుకురావాలని సూచించారు. కాగా, నగరంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ ప్రభుత్వ కళాశాల, స్వర్ణభారతి ఇంజనీరింగ్ కళాశాల (ఎస్‌బీఐటీ), కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాల, హార్వెస్ట్ పబ్లిక్ స్కూల్, బొమ్మ ఇంజనీరింగ్ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేసినట్లు ఆయన తెలిపారు.

పోలీస్ శాఖ ఆధ్వర్యాన జాబ్‌మేళాకు ఏర్పాట్లు

ఖమ్మంక్రైం: ప్రైవేట్, కార్పొరేట్ కంపెనీల్లో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పోలీసు శాఖ ఆధ్వర్యాన ఈనెల 21న ఖమ్మం ఎస్‌బీఐటీలో నిర్వహించనున్న మెగా జాబ్‌మేళాకు ఏర్పాట్లు పూర్తయ్యాయని కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన సోమవారం జిల్లాలోని ఎస్‌హెచ్‌ఓల ద్వారా వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. అర్హులైన యువత పెద్దసంఖ్యలో ఈనెల 18లోగా దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఎస్సెస్సీ విద్యార్హతతో 1,200 ఉద్యోగాలు, ఇంటర్ పాస్ లేదా ఫెయిల్‌తో వెయ్యి, డిగ్రీ, డిప్లొమా(పాస్ లేదా ఫెయిల్), బీటెక్(పాస్ లేదా ఫెయిల్) అర్హతతో 500 ఉద్యోగాలే కాక హోటల్ మేనేజ్‌మెంట్, పీజీ, ఫార్మసీ పూర్తి చేసిన వారికి ఉద్యోగాలు కల్పించనున్నట్లు సీపీ తెలిపారు.

గ్రీవెన్స్‌కు విశేష స్పందన



గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు వింటున్న సీపీ వారియర్

ఖమ్మంక్రైం: ప్రజాసమస్యలు తెలుసుకునేందుకు పరిష్కరించేందుకు సోమవారం జరిగిన గ్రీవెన్స్ సెల్‌లో భాగంగా సీపీ విష్ణు ఎస్.వారియర్ కమిషనరేట్‌కు వివిధ ప్రాంతాల నుండి వచ్చిన వారితో మాట్లాడారు. ఫిర్యాదుల వివరాలు క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత ఎస్‌హెచ్‌ఓలను ఆదేశించారు. వృద్ధాప్యంలో వారసులు పట్టించుకోవడం లేదని కొందరు, భూవివాదాలు, కుటుంబ, వ్యక్తిగత, సమస్యలు, ఆర్థిక లావాదేవీలు, భార్యాభర్తల తగాదాలపై పలువురు ఫిర్యాదులు అందజేశారు. కాగా, ఇటీవల బదిలీపై వివిధ జిల్లాల నుండి ఖమ్మం వచ్చిన వారితోపాటు పదోన్నతి పొందిన ఏడుగురు ఏఎస్సైలు, తొమ్మిది మంది హెడ్ కానిస్టేబుళ్లకు సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈమేరకు వారికి పోస్టింగ్ ఇచ్చేందుకు కౌన్సెలింగ్ నిర్వహించిన సీపీ విష్ణు ఎస్.వారియర్ సీనియారిటీ ప్రకారం నేరుగా మాట్లాడి కోరుకోన్న చోట అవకాశాల మేరకు పోస్టింగ్ కల్పిస్తామని కమిషనర్ తెలిపారు.



'కంటి వెలుగు'లు

పరీక్షలు, అద్దాల పంపిణీ..

పరీక్షలు పూర్తయిన జీపీలు	440
కార్పొరేషన్ / మున్సిపాలిటీల్లో వార్డులు	101
ఇంత వరకు పరీక్షలు చేయించుకున్న వారు	5,24,085
పురుషులు	2,48,268
మహిళలు	2,73,031
ట్రాన్స్‌జెండర్లు	2,514
రీడింగ్ గ్లాసులు తీసుకున్న వారు	1,07,972
ప్రిస్క్రిప్షన్ గ్లాసులు కావాల్సిన వారు	70,526
ప్రిస్క్రిప్షన్ గ్లాసుల డెలివరీ	51,547
ఎలాంటి కంటి సమస్యలు లేని వారు	3,45,567

జిల్లాలో జోరుగా సాగుతున్న పరీక్షలు

- ఇప్పటివరకు 5,24,082 మందికి పూర్తి
- అద్దాల పంపిణీతో పాటు మరోపక్క శస్త్ర చికిత్సలు కూడా..
- 66శాతం మందికి కంటి సమస్యలు లేవని గుర్తింపు

ఖమ్మం వైద్యవిభాగం: రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం జిల్లాలో జోరుగా సాగుతోంది. ప్రత్యేక శిబిరాల ద్వారా కంటి పరీక్షలు నిర్వహిస్తూ అవసరమైన వారికి అక్కడే రీడింగ్ గ్లాసులు అందజేస్తున్నారు. తీవ్రమైన కంటి సమస్యలతో బాధపడే వారి పేర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేసి వారికి మూడు, నాలుగు వారాల్లో ప్రిస్క్రిప్షన్ గ్లాసులు ఇస్తున్నారు. అంతేకాక అవసరమైన వారికి జిల్లా కేంద్రంలోని ఆస్పత్రిలో శస్త్ర చికిత్సలు కూడా నిర్వహిస్తున్నారు. ఇక్కడ అందుబాటులో లేనిపక్షంలో హైదరాబాద్‌కు రిఫర్ చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటివరకు 5,24,082మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 2,48,268 మంది పురుషులు, 2,73,031 మంది మహిళలతో పాటు 2,514 మంది ట్రాన్స్‌జెండర్స్ కూడా ఉన్నారు. ఇంత వరకు నిర్వహించిన కంటి పరీక్షల్లో 65.74 శాతం మందికి ఎలాంటి కంటి సమస్యలు లేవని గుర్తించారు.

జనవరి 18న ప్రారంభం

రాష్ట్రంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని నలుగురు ముఖ్యమంత్రుల సమక్షాన ఖమ్మం నూతన కలెక్టరేట్‌లో ఈ ఏడాది జనవరి 18న ప్రారంభించిన విషయం విదితమే. అప్పటి నుండి శని, ఆదివారాలతో పాటు వివిధ సెలవులు మినహా మిగతా రోజుల్లో కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో ఇప్పటివరకు 589 పంచాయతీలకు గాను 440 గ్రామపంచాయతీల్లో కంటి వెలుగు పరీక్షలు పూర్తయ్యాయి. అలాగే కార్పొరేషన్, మున్సిపాలిటీల్లోని 101 వార్డుల్లోనూ పరీక్షలు పూర్తిచేశారు. జిల్లాలో 5,24,082మంది పరీక్షలు పూర్తిచేయగా 3,45,567 మందికి కంటి సంబంధిత సమస్యలు లేవని తేల్చారు.

శస్త్రచికిత్సలపై ప్రత్యేక దృష్టి

కంటి వెలుగు పరీక్షల ద్వారా సమస్య ఉన్నట్లు తేలిన వారికి రీడింగ్ గ్లాసులతో పాటు ప్రిస్క్రిప్షన్ గ్లాసులు కూడా అందిస్తున్నారు. ఇదే సమయాన శస్త్రచికిత్సలపై కూడా అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లాలో ఇంత వరకు 1,07,972 మందికి రీడింగ్ గ్లాసులు, 70,526 మందికి ప్రిస్క్రిప్షన్ గ్లాసులు అందజేశారు. అలాగే ఖమ్మం జనరల్ ఆస్పత్రిలో అవసరమైన వారికి కంటి శుక్ల శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నారు. జనవరిలో 25 మందికి, ఫిబ్రవరిలో 85 మందికి, మార్చిలో 102 మందికి, ఏప్రిల్‌లో 132 మందికి శస్త్రచికిత్సలు నిర్వహించారు. అలాగే ఈనెలలోనూ పలువురికి శస్త్ర చికిత్సలు చేశారు. ఇక ఇక్కడ అందుబాటులో లేని శస్త్రచికిత్సలకు హైదరాబాద్‌కు రిఫర్ చేస్తున్నారు. ఇప్పటి వరకు టెరీజియం గ్రాఫ్టింగ్ 17, గ్లకోమా 36, డయాబెటిక్ రెటినోపతి సమస్యతో బాధపడే 25 మందితో పాటు ఇంకా పలువురిని రిఫర్ చేశారు.

అందరికీ కంటి పరీక్షలు...



జిల్లాలో కంటి వెలుగు కార్యక్రమం నిరాటంకంగా కొనసాగుతోంది. ప్రణాళికాయుతంగా శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం. ఒక్కో శిబిరంలో అక్కడ ప్రజలు పూర్తి స్థాయిలో కంటి పరీక్షలు చేయించుకున్నాకే ఇంకో చోటకు శిబిరాన్ని తరలిస్తున్నాం. అవసరమైన వారికి అద్దాలు అందజేస్తున్నాం. శస్త్ర చికిత్స అవసరమైన వారికి వరుసక్రమంలో చేయిస్తున్నాం. నూరు శాతం కార్యక్రమాన్ని పూర్తి చేసేలా మా ఉద్యోగుల బృందం శ్రమిస్తోంది.

– డాక్టర్ మాలతి, డీఎంహెచ్‌ఓ

ఫిర్యాదుల పరిష్కారానికి సత్వర చర్యలు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వీ.పీ.గౌతమ్

గ్రీవెన్స్‌లో కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సహకారనగర్: ప్రజలు అందిస్తున్న ఫిర్యాదులను పరిశీలించి సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం గ్రీవెన్స్ డేలో భాగంగా ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతిపత్రాలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ ఫిర్యాదును పరిశీలించి త్వరగా పరిష్కారం చూపాలని తెలిపారు.

ఫిర్యాదుల్లో కొన్ని..

రఘునాథపాలెంలో పద్మశాలీ గౌడ కమ్యూనిటీ హాళ్లకు కేటాయించిన భూమిని ఓ వ్యక్తి ఆక్రమించినందున, తిరిగి ఇప్పించాలని మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ వినతిపత్రం అందజేశారు. అలాగే, ఎర్రుపాలెం మండలం భీమవరంలోని పెద్ద చెరువు శిఖం భూములు ఆక్రమణకు గురికాకుండా చర్యలు చేపట్టాలని ఆయకట్టు రైతులు ఎస్.కే.బందారు, సీతారాంరెడ్డి, రాజారావు, రాజేష్ కోరారు. వైరా మండలంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటుచేయాలని రైతు సంఘం నాయకులు బాణాల శ్రీనివాసరావు, టి.నాగేశ్వరరావు తదితరులు వినతిపత్రం అందజేశారు. కాగా, తల్లాడ జీపీ పరిధి మల్లారంలో చేపలు, చికెన్ వ్యర్థాలతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు ఫిర్యాదు చేశారు.

మాజీ సైనికుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

జిల్లాలో మాజీ సైనికుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు కలెక్టర్ గౌతమ్ తెలిపారు. కలెక్టరేట్‌లో జిల్లా సైనిక బోర్డు సమావేశం ఏర్పాటుచేయగా కలెక్టర్ మాట్లాడుతూ మాజీ సైనికుల కుటుంబాలు, మరణించిన సైనికుల కుటుంబాల సంక్షేమానికి ప్రభుత్వం రాయితీలు, ఆర్థిక సహకారం, పథకాలు అమలుచేస్తోందని చెప్పారు. మునిసిపల్, పంచాయతీల ద్వారా ఆస్తి పన్ను మినహాయింపుపై సంబంధిత అధికారులు దృష్టి సారించాలని సూచించారు. ఈసమావేశాల్లో అదనపు కలెక్టర్లు స్నేహలత, ఎస్.మధుసూదన్, డీఆర్వో ఆర్.శిరీష, జిల్లా ఇన్‌చార్జ్ సైనిక సంక్షేమ అధికారి కె.శ్రీరామ్, డీఎంహెచ్‌ఓ బి.మాలతి, డీఆర్డీఓ విద్యాచందన, జెడ్పీ సీఈఓ అప్పారావు పాల్గొన్నారు.

మండే ఎండలు..

- పెనుబల్లిలో గరిష్టంగా 44.3 డిగ్రీలు



జిల్లా వ్యాప్తంగా ఎండలు గరిష్ట స్థాయికి చేరాయి. ఆదివారం కూడా ఇదే పరిస్థితి ఉండగా సోమవారం ఉష్ణోగ్రత మరింత పెరిగింది. దీంతో ప్రజలు బయటకు అడుగు పెట్టాలంటేనే జంకారు. ఉదయం 10గంటల నుంచే వడగాలులు మొదలుకావడంతో జిల్లాలోని ప్రధాన రహదారులన్నీ నిర్మానుష్యంగా కనిపించాయి. దాదాపు జిల్లా అంతటా 41 డిగ్రీల పైనే ఉష్ణోగ్రత నమోదైంది - 8లో..

సీతాకోక చిలుకలా ఖమ్మం !





సైకిళ్లపై వెళ్తున్న మంత్రి పువ్వాడ, కలెక్టర్ గౌతమ్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ (ఇన్‌సెట్) బస్టాండ్‌లో ప్రయాణికులతో మాట్లాడుతున్న మంత్రి

- అన్నిరంగాల్లో అభివృద్ధి జరుగుతోంది..
- త్వరలోనే ఇల్లెందు బస్ డిపో ప్రారంభం
- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ ఏర్పడక ముందు గొంగళి పురుగులా ఉన్న ఖమ్మంను రాష్ట్రం ఏర్పడ్డాక సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో సీతాకోక చిలుకలా మార్చుకున్నామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. కలెక్టర్ వీ.పీ.గౌతమ్, మేయర్ పునుకొల్లు నీరజ, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభితో కలిసి మంత్రి పువ్వాడ సోమవారం ఉదయం సైకిల్‌పై నగరంలోని వన్ టౌన్, టూటౌన్, త్రీటౌన్ ప్రాంతాల్లోని పలు డివిజన్లలో పర్యటించారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనులు, పారిశుద్ధ్యం, నీటి సరఫరాను పరిశీలించారు. కాగా, 50వ డివిజన్ మామిళ్లగూడెంలోని కూరగాయల మార్కెట్‌కు వెళ్లగా వ్యర్థాలు ఆలస్యంగా తొలగిస్తున్నారని వ్యాపారులు ఫిర్యాదు చేశారు. దీంతో తక్షణమే పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్‌ను మంత్రి ఆదేశించారు. పక్కనే ఉన్న పీ.వీ.నర్సింహారావు పార్క్‌లో కరాటే శిక్షణను పరిశీలించాక మయూరిసెంటర్ బ్రిడ్జి పనులపై ఆర్ అండ్‌బీ ఈఈ శ్యాంప్రసాద్‌తో చర్చించారు. ఇక 35వ డివిజన్ బురద రాఘవాపురం ఎస్సీ కాలనీలో మిషన్ భగీరథ కనెక్షన్లకు నీటి సరఫరాను మంత్రి ప్రారంభించారు.

ప్రణాళికాయుతంగా అభివృద్ధి

పలు డివిజన్లలో మంత్రి పువ్వాడ మాట్లాడుతూ గత నాలుగేళ్లలో మౌలిక వసతులు అందుబాటులోకి వచ్చేలా ప్రణాళికాయుతంగా పనిచేస్తున్నామని తెలిపారు. ప్రజలకు మరింత చేరువ కావడం, సమస్యలను పరిశీలించి పరిష్కరించేందుకు వాడవాడకు పువ్వాడ కార్యక్రమం చేపట్టామన్నారు. మురుగు సమస్యను సైతం పూర్తిగా తొలగించాలనే ఉద్దేశంతోనే డివిజన్‌కు రూ.40 లక్షలు కేవలం సైడ్ డ్రెయిన్ల నిర్మాణానికి కేటాయించామన్నారు. నగరంలో 16,500 నల్లా కనెక్షన్లు అవసరం కాగా మంత్రి కేటీఆర్ అనుమతించారని తెలిపారు.

త్వరలోనే అందుబాటులోకి ఇల్లెందు డిపో

ఖమ్మం కొత్త బస్టాండ్‌ను సందర్శించిన మంత్రి పువ్వాడ అక్కడ పారిశుద్ధ్య నిర్వహణ, కార్గో సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ నుండి వచ్చిన ప్రయాణికులతో మాట్లాడగా ఇల్లెందు వెళ్లాలని చెప్పారు. హైదరాబాద్ నుండి నేరుగా ఇల్లెందుకు బస్సులు లేవా అని ఆరా తీసిన మంత్రి.. వారం, పది రోజుల్లో ఇల్లెందు బస్ డిపో ప్రారంభమవుతుందని, తద్వారా బస్సులు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. ఈకార్యక్రమాల్లో సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, ఈఈలు రంజిత్, కృష్ణాలాల్, తహసీల్దార్ శైలజ, కార్పొరేటర్లు రాపర్తి శరత్, పసుమర్తి రామ్మోహన్‌రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజుతో పాటు నాయకులు కన్నం ప్రసన్నకృష్ణ, ఆళ్ల అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉమ్మడి జిల్లాలో
గవర్నర్ పర్యటన

- భద్రాద్రిలో స్వామి దర్శనం, పూజలు
- గిరిజనుల వైద్య, ఆరోగ్య శిబిరానికి హాజరు
- ఖమ్మంలో చైతన్య కాలేజీ విద్యార్థులతో ముఖాముఖి

భద్రాచలం: రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ బుధవారం భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో పర్యటించనున్నారు. కేవలం ఏడాది వ్యవధిలోనే గవర్నర్ నాలుగోసారి భద్రాచలం పర్యటనకు వస్తుండడం విశేషం. గతంలో ఒకసారి రామాలయం దర్శనం, గిరిజనులతో ముఖాముఖి, రెండోసారి రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో, మూడోసారి మార్చిలో జరిగిన రామచంద్ర స్వామి పట్టాభిషేక మహోత్సవంలో ఆమె పాల్గొన్నారు. అలాగే, గత ఏడాది గోదావరి వరదల సమయాన అశ్వాపురంలో బాధితులను పరామర్శించారు. దీంతో జిల్లాకు ఐదో సారి, భద్రాచలానికి నాలుగో సారి వస్తున్నట్లవుతోంది. కాగా, ఈనెల 11న భద్రాచలానికి గవర్నర్ వస్తారని షెడ్యూల్ విడుదల చేయగా, ఈసారి బుధవారం మాత్రం భద్రాచలం, ఖమ్మం జిల్లాల పర్యటన ఖరారైంది. తొలుత హెలీకాప్టర్‌లో వస్తారని చెప్పినా.. 17న రైలు మార్గంలో గవర్నర్ తమిళిసై రానున్నట్లు రాజ్‌భవన్ వర్గాలు వెల్లడించాయి.

గవర్నర్ పర్యటన షెడ్యూల్ ఇలా..

రాజ్‌భవన్ వర్గాలు భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో గవర్నర్ పర్యటన షెడ్యూల్‌ను సోమవారం విడుదల చేశాయి. మంగళవారం రాత్రి సికింద్రాబాద్ స్టేషన్ నుంచి రైలులో బయలుదేరనున్న గవర్నర్ బుధవారం తెల్లవారుజామున 4.15 గంటలకు కొత్తగూడెం చేరుకుని రోడ్డు మార్గంలో సారపాకలోని ఐటీసీ గెస్ట్‌హౌస్‌కు వస్తారు. ఉదయం 8.30 గంటలకు భద్రాచలంలో శ్రీ సీతారామ చంద్రస్వామిని దర్శించుకుని పూజలు చేశాక కూనవరం రోడ్డులో ఉన్న వీరభద్ర ఫంక్షన్ హాల్‌లో జరిగే గిరిజనులకు ఆరోగ్య అవగాహన సదస్సు, గిరిజనులతో ముఖాముఖితో పాటు రెడ్ క్రాస్ సమావేశంలో పాల్గొంటారు. అనంతరం 12 గంటలకు ఐటీసీ గెస్ట్‌హౌస్‌కు చేరుకుని భోజనం అనంతరం కొత్తగూడెంలోని ఇల్లెందు గెస్ట్‌హౌస్‌కు, అక్కడి నుంచి ఖమ్మంలోని ఎన్నెస్పీ గెస్ట్‌హౌస్‌కు వస్తారు. మధ్యాహ్నం 3గంటలకు ఖమ్మం జిల్లా పొన్నెకల్లులోని చైతన్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, రీసెర్చ్ కళాశాలలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొనడమే కాక ఇంజనీరింగ్ విద్యార్థులతో ముఖాముఖి సమావేశమవుతారు. అనంతరం రోడ్డు మార్గంలో మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ రైల్వేస్టేషన్‌కు వెళ్లనున్న గవర్నర్ తమిళిసై సాయంత్రం ఆరు గంటలకు రైలులో సికింద్రాబాద్ బయలుదేరతారు.



తమిళిసై సౌందరరాజన్, గవర్నర్

ఇక హెల్త్ వెల్‌నెస్ కేంద్రాలు

- ఆరోగ్యశ్రీ నుంచి ఆయుష్మాన్ భారత్‌లోకి ఆస్పత్రులు
- కొత్త రంగులతో కళకళలాడుతున్న సర్కార్ ఆస్పత్రులు
- ఆరు రకాల వైద్యసేవలతో పాటు ప్రతీనెల హెల్త్ మేళా

సత్తుపల్లిటౌన్: ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సర్కార్ ఆస్పత్రులను తీర్చిదిద్దుతున్నాయి. ప్రస్తుతం ఆరోగ్యశ్రీ నుంచి ఆయుష్మాన్ భారత్‌లోకి జిల్లాలోని 30 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 161 ఆరోగ్య ఉపకేంద్రాలను చేర్చారు. జిల్లాలో 224 ఆరోగ్య ఉపకేంద్రాలు ఉండగా వీటిలో 161 ఆరోగ్య ఉపకేంద్రాలను హెల్త్ వెల్‌నెస్ కేంద్రాలుగా ఎంపిక చేశారు. ఈ నేపథ్యాన ఈ ఆస్పత్రుల భవనాలకు ముదురు పసుపురంగు వేయించగా.. కొత్తశోభ సంతరించుకుని కళకళలాడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ ఆస్పత్రులను ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు.





కొత్త రంగులతో సత్తుపల్లి మండలంలోని గంగారం పీహెచ్‌సీ (ఇన్‌సెట్) ఆస్పత్రి భవనంపై మెడిటేషన్, హెల్త్ ఎడ్యుకేషన్ లోగోలు

వెల్‌నెస్ కేంద్రాలుగా..

ఆరోగ్య ఉపకేంద్రాలు ఇక మీదట వెల్‌నెస్ కేంద్రాలుగా మారనున్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందించే వైద్యసేవలన్నీ వెల్‌నెస్ కేంద్రాల్లోనూ అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో ఓ వైద్యుడితో పాటు స్టాఫ్‌నర్స్, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు ఉంటారు. కాగా, వివిధ రుగ్మతల బారిన పడిన వారికి అందించే వైద్య సేవలు ప్రతిబింబించేలా ఆరు లోగోలతో ఆస్పత్రుల గోడలపై గీసిన బొమ్మలు ఆకట్టుకుంటున్నాయి. మాతా శిశు ఆరోగ్యం, వ్యాధినిరోధక టీకాలు, యోగా మెడిటేషన్, టెలీ కన్సల్టేషన్, వయోవృద్ధుల వైద్య పరీక్షలు, హెల్త్ ఎడ్యుకేషన్‌ను ప్రాధాన్యతను చాటేలా బొమ్మలు గీయించారు.

వైద్య సేవలు అందుబాటులోకి..



గ్రామీణ ప్రజలకు పూర్తి స్థాయిలో వైద్యసేవలు అందనున్నాయి. ఈమేరకు ప్రభుత్వం ఆయుష్మాన్‌భారత్ కింద హెల్త్ వెల్‌నెస్ కేంద్రాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ కేంద్రాల్లో ఆరు రకాల వైద్య సేవలతో పాటు ప్రతీనెల హెల్త్ మేళాలు నిర్వహించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తారు.

– నీలోహణ, ఎన్‌హెచ్‌ఎం జిల్లా ప్రాజెక్టు అధికారి

అమెరికాలో రామాలయ నిర్మాణం

స్వామివారి విగ్రహాలకు భద్రాద్రిలో పూజలు

భద్రాచలం: అమెరికాలోని అట్లాంటాలో నిర్మిస్తున్న రామాలయంలో ప్రతిష్ఠించే విగ్రహాలకు సోమవారం భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో పూజలు చేశారు. అట్లాంటా ఎస్ఆర్ఐల ఆధ్వర్యంలో భద్రాచలం రామాలయ నమూనా తరహాలో ఉండేలా ఆలయం నిర్మిస్తున్నారు. ఇందులో ప్రతిష్ఠించేందుకు ఏపీలోని కర్నూలు జిల్లా నంద్యాలలో శ్రీ సీతారామలక్ష్మణులు, ఆంజనేయుడు, గరుత్మంతుడి విగ్రహాలను తయారు చేశారు. సోమవారం వీటిని ఏపీ దేవాదాయ శాఖ రిటైర్డ్ స్థపతి రాజేశ్వరాచార్యులు ఆధ్వర్యంలో భద్రాచలం తీసుకొచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు ఆధ్వర్యంలో ఈ విగ్రహాలకు ప్రత్యేక పూజలు, ధాన్యాధివాసం చేశారు.



విగ్రహాలకు ధాన్యాధివాసం చేస్తున్న అర్చకులు, ఆలయ ఈఓ రమాదేవి

45 రోజుల పాటు ధాన్యాధివాస పూజల అనంతరం విగ్రహాలను అట్లాంటాకు తీసుకెళ్లనున్నారు. భద్రాద్రి రామాలయంలో జరిగే సంప్రదాయ పూజలనే అట్లాంటాలోనూ ఆచరించేలా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు రాజేశ్వరాచార్యులు తెలిపారు. ధాన్యాధివాస పూజల్లో ఆలయ ఈఓ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

39 గ్రామాల్లో హైమాస్ట్ లైట్లకు రూ.1.40కోట్లు



చెరువుకొమ్ము తండాలో దిమ్మె నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్, ఇంజనీర్

రఘునాథపాలెం: రఘునాథపాలెం మండలంలోని పలు గ్రామాల్లో హైమాస్ట్ లైట్ల వెలుగులతో ప్రధాన కూడళ్లు జిగేల్‌మననున్నాయి. మండలంలోని 37 గ్రామపంచాయతీల 39 ప్రధాన కూడళ్లలో హైమాస్ట్ లైట్ల ఏర్పాటుకు 'సుడా' నుంచి రూ.1.40కోట్లు కేటాయించారు. ఇప్పటికే 15 ప్రాంతాల్లో లైట్ల ఏర్పాటుకు అవసరమైన దిమ్మెల నిర్మాణం జరుగుతోంది. మేజర్ పంచాయతీలుగా ఉన్న రఘునాథపాలెం, మంచుకొండ, వీ.వీ.పాలెం గ్రామాల్లో ఇప్పటికే సెంట్రల్ లైటింగ్ అందుబాటులోకి రాగా, మిగిలిన పంచాయతీల్లో హైమాస్ట్ లైట్లు ఏర్పాటుచేయనున్నారు.

ఏపీపీ మృతిపై సంతాపం



రామారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

ఖమ్మం లీగల్: ఖమ్మంకు చెందిన న్యాయవాది, భద్రాద్రి కొత్తగూడెం కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్(ఏపీపీ) కుమ్మరి రామారావు సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనకు భార్య, కూతురు ఉన్నారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దిరిశాల కృష్ణారావు ఆధ్వర్యాన సంతాప సభ నిర్వహించగా పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ రామారావు సేవలను కొనియాడారు. విద్యార్థి ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న ఆయన న్యాయవాద వృత్తిలో రాణించారని గుర్తు చేశారు. అలాగే, ఇటీవల మృతిచెందిన తుమ్మలపల్లి విజయ్‌కుమార్‌కు బార్ అసోసియేషన్ సంతాపం తెలిపింది. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మన్నేపల్లి బసవయ్యతో పాటు మాదిరాజు లక్ష్మీనారాయణ, కొల్లి సత్యనారాయణ, బిచ్చాల తిరుమలరావు, కాటంనేని రమేష్, పొట్ల మాధవరావు, శివకుమార్, కర్లపూడి శ్రీనివాస్, వెంకట్‌గుప్తా, పి.దానయ్య, నేరెళ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


12 ఎకరాల మొక్కజొన్న పంట దగ్ధం

బోనకల్: ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు ప్రమాదవశాత్తు నిప్పంటుకుంది. ఈ ఘటనలో 12 ఎకరాల్లోని మొక్కజొన్న కంకి దగ్ధమైంది. చింతకాని మండలానికి చెందిన తూములూరి ముత్తయ్యతో పాటు బోనకల్ మండలం తూటికుంట్లకు చెందిన రైతులు నల్లమోతు శ్రీనివాసరావు, నెల్లూరి శేఖర్, కనకపూడి కృష్ణ తాము పండించిన మొక్కజొన్న కంకులను వేర్వేరుగా కుప్పలు పోశారు. అయితే, ఓచోట గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించడంతో అందరి కుప్పలకు మంట అంటుకుని కాలిపోయాయి. ఈ ఘటనలో సుమారు రూ.6లక్షల మేర నష్టం జరిగిందని బాధిత రైతులు వాపోయారు.

ప్రమాదవశాత్తు వరిగడ్డి దగ్ధం

ఏన్కూరు: ప్రమాదవశాత్తు నిప్పంటుకోవడంతో వరిగడ్డి దగ్ధమైన ఘటన మండలంలోని తూతకలింగన్నపేటలో సోమవారం జరిగింది. గ్రామానికి సమీపాన పొలాల్లో రైతులు పత్తి కట్టె కాలుస్తుండగా నిప్పురవ్వలు సమీపంలోని రావుల సత్యనారయణ పొలంలో వరిగడ్డికి అంటుకొని మంటలు వ్యాపించాయి. సత్యనారాయణతో పాటు మరో ఏడుగురు రైతుల పొలాల్లోని వరిగడ్డి పూర్తి కాలిపోయింది. కొత్తగూడెం నుంచి అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలు అదుపు చేశారు.

డీలర్ల సమస్యలు పరిష్కరించకపోతే బంద్



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న డీలర్లు

ఖమ్మం సహకారనగర్: సమస్యలను వచ్చే నెల జూన్ 4వ తేదీలోగా పరిష్కరించకుంటే రేషన్ దుకాణాలు బంద్ చేస్తామని తెలంగాణ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘాల ఐక్యవేదిక బాధ్యులు వెల్లడించారు. ఈమేరకు సోమవారం వారు అదనపు కలెక్టర్ ఎన్.మధుసూదన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వేదిక బాధ్యులు వెంకన్న, దర్గయ్య, జానీమియా తదితరులు మాట్లాడుతూ తమకు గౌరవ వేతనం చెల్లించడమే కాక ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు. డీలర్లు వెంకటరెడ్డి, ఇబ్రహీం, మహేష్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రికి ఐదుగురు ఎంబీబీఎస్ వైద్యులు

ఖమ్మంవైద్యవిభాగం: ఎంబీబీఎస్ పూర్తి చేసిన ఐదుగురు విద్యార్థులు జిల్లా ప్రధాన ఆస్పత్రిలో అప్రంటీస్ కోసం చేరారు. ఈమేరకు వీరు ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిసి విధుల్లో చేరారు. ఏడాది పాటు వీరు ఖమ్మం ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో విధులు నిర్వర్తించనున్నారు.

మండే ఎండలు...



- పెనుబల్లిలో గరిష్టంగా 44.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- ఖమ్మంలో 44.1 డిగ్రీల ఎండ
- జిల్లా అంతటా 41 డిగ్రీల పైనే...
- వడగాల్పులతో జనం ఇక్కట్లు

ఖమ్మం వ్యవసాయం: సూర్య ప్రతాపం కొనసాగుతోంది. వారం రోజులుగా ఎండ తీవ్రత పెరుగుతుండగా ఆది, సోమవారాల్లో తీవ్రరూపం దాల్చింది. జిల్లా వ్యాప్తంగా సోమవారం 41–45 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యధికంగా పెనుబల్లి మండల కేంద్రంలో 44.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, ఖమ్మం నగరంలో 44.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఎండతీవ్రతతో పాటు వడగాలులు కూడా వీస్తుండగా జనం ఇబ్బంది పడుతున్నారు. ఉదయం 8 గంటల నుంచే ఎండ ప్రభావం మొదలవుతుండడంతో ఇళ్ల నుంచి బయటకు రావాలంటే జంకుతున్నారు. దీంతో మధ్యాహ్నం వేళ రహదారులు నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. ప్రధానంగా పిల్లలు, వృద్ధులు ఎండ తీవ్రత కారణంగా ఇబ్బంది పడుతున్నారు. ఇబ్బందులు పడుతున్నారు. ఇక ఏసీలు, కూలర్లు నిర్విరామంగా నడుస్తుండడంతో విద్యుత్ వినియోగం పెరిగింది.



బిడ్డకు గొడుకు పట్టుకుని వెళ్తున్న మహిళ

సోమవారం జిల్లాలో ఉష్ణోగ్రతలు (డిగ్రీ సెల్సియస్‌ల్లో)

మండలం	ప్రాంతం	ఉష్ణోగ్రత
పెనుబల్లి	పెనుబల్లి	44.3
ఖమ్మం అర్బన్	ఖానాపురం	44.1
మధిర	మధిర	43.9
సత్తుపల్లి	సత్తుపల్లి	43.9
కామేపల్లి	లింగాల	43.9
ఎర్రుపాలెం	ఎర్రుపాలెం	43.9
ఖమ్మం అర్బన్	ప్రకాష్‌నగర్	43.8
ఖమ్మం రూరల్	పల్లెగూడెం	43.8
ముదిగొండ	ముదిగొండ	43.8
రఘునాథపాలెం	రఘునాథపాలెం	43.8
తిరుమలాయపాలెం	బచ్చోడు	43.2
నేలకొండపల్లి	నేలకొండపల్లి	43.0
వేంసూరు	వేంసూరు	42.9
మధిర	సిరిపురం	42.7
కల్లూరు	కల్లూరు	42.6
తల్లాడ	తల్లాడ	42.5
మధిర	మధిర	42.5
కొణిజర్ల	కొణిజర్ల	42.4
సింగరేణి	గేటు కారేపల్లి	42.4
తిరుమలాయపాలెం	తిరుమలాయపాలెం	42.4
చింతకాని	చింతకాని	42.1
బోనకల్	రావినూతల	42.0
ముదిగొండ	బాణాపురం	42.0
వైరా	వైరా	41.8
తల్లాడ	తల్లాడ	41.7
కూసుమంచి	కూసుమంచి	41.6
ఏన్కూరు	ఏన్కూరు	41.5

క్రీడా అవకాశాలను మెరుగుపర్చుకోండి



మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ, పక్కన కలెక్టర్ గౌతమ్, సీపీ వారియర్, మేయర్ నీరజ, కమిషనర్ ఆదర్శ్, డీవైఎస్ఓ పరంధామరెడ్డి

- మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్
- నగర స్థాయి సీఎం కప్ క్రీడాపోటీలు ప్రారంభం

ఖమ్మం స్పోర్ట్స్: క్రీడా పోటీల్లో పాల్గొనడం ద్వారా అవకాశాలను మెరుగుపర్చుకోవాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సూచించారు. నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో నగరస్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను సోమవారం మంత్రి ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలోఎక్కడాలేని విధంగా సర్దార్ పటేల్ స్టేడియంలో మౌళిక సదుపాయాలు కల్పించగా, కల్లూరు, వైరాలో స్టేడియంలు పూర్తయ్యాయని తెలిపారు. ఈమేరకు మండల స్థాయి పోటీల్లో సత్తా చాటి జిల్లా, రాష్ట్ర స్థాయికి ఎదగాలని చెప్పారు. కలెక్టర్ వీ.పీ.గౌతమ్ మాట్లాడుతూ ఉత్సాహంగా క్రీడల్లో పాల్గొని జిల్లాకు పేరు తీసుకురావాలని సూచించారు. ఖమ్మం పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సాహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేఎంసీ కమిషనర్ ఆదర్శ్‌సురభి మాట్లాడుతూ క్రీడాపోటీల్లో నగరవాసులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు. అనంతరం వాలీబాల్, ఖోఖో, అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, కబడ్డీ పోటీలను ప్రారంభించారు. మేయర్ పునుకోల్లు నీరజ, డీఈఓ సోమశేఖర శర్మ, డీవైఎస్ఓ ఎం.పరంధామరెడ్డి, కోచ్‌లు, క్రీడాసంఘాల బాధ్యులు ఎం.డీ.గౌస్, ఎం.డీ.అక్బర్ అలీ, క్రిస్టోఫర్‌బాబు, కె.ఆదర్శ్‌కుమార్, ఎం.డీ.మతిన్, ఓలేటి సాంబమూర్తి, గోపాల్‌రావు, పరిపూర్ణాచారి, వి.మోహన్, మల్లయ్య, జైనాబ్ తస్లీం, కృష్ణయ్య, కృష్ణమూర్తి పాల్గొన్నారు.



అథ్లెటిక్స్ పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ గౌతమ్, సీపీ వారియర్

నాలుగేళ్లలో మా ఊరికేం చేశారు?

వైరా ఎమ్మెల్యేను నిలదీసిన గ్రామస్తులు

కారేపల్లి: గడిచిన నాలుగేళ్లలో మా ఊరిని పట్టించుకోలేదు... ఏం అభివృద్ధి చేయలేదు.. ఇప్పుడు ఓట్ల కోసమే హడావుడి చేస్తున్నారు... అంటూ ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం దుబ్బతండా గ్రామంలోని పలువురు వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్‌ను అడ్డుకునే ప్రయత్నం చేశారు. దుబ్బతండా గ్రామంలో 'మన ఊరు – మన ఎమ్మెల్యే' కార్యక్రమాన్ని సోమవారం వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గడపగడపకు తిరుగుతూ ఫించన్లు వస్తున్నాయా, రైతుబంధు పడిందా, కల్యాణలక్ష్మి చెక్కులు అందుతున్నాయా.. అని ఆరా తీస్తూ ముందుకు సాగారు. ఇంతలోనే కొందరు ఆయనను అడ్డుకునే ప్రయత్నం చేశారు. నాలుగేళ్లలో మా ఊరికేం చేయలేదు.. కనీసం కరెంట్ స్తంభాలు, సీసీ రోడ్లు వేయలేదు అంటూ ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో బీఆర్ఎస్ కార్యకర్తలు వారిని ప్రతిఘటించడంతో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. దీంతో ఎస్ఐ పుష్పాల రామారావు కలగజేసుకొని సమస్యలు ఉంటే ఎమ్మెల్యే దృష్టికి సానుకూలంగా సూచించగా ఆందోళన సద్దుమణిగింది. ఎంపీపీ మాలోతు శకుంతల, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెద్దబోయిన ఉమాశంకర్, సర్పంచ్ బానోతు బద్రి నాయకులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను నిలదీస్తున్న గ్రామస్తులు

రూ.3.50 లక్షల సొత్తు చోరీ

సత్తుపల్లి టౌన్: తాళం వేసిన ఉన్న ఇంట్లో చొరబడిన దుండగులు రూ.3.50లక్షల విలువైన సత్తు అపహరించారు. సత్తుపల్లి ద్వారకాపురి కాలనీ ఐదో నంబర్ వీధిలో నివాసం ఉంటున్న రిటైర్డ్ ఉపాధ్యాయుడు కొదమసింహం జనార్దనాచారి వారం క్రితం కుటుంబ సభ్యులతో కలిసి ఊరికి వెళ్లారు. ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో చొరబడి రూ.3.50లక్షల విలువైన వెండి, బంగారు వస్తువులు అపహరించారు. సోమవారం ఇంటికి వచ్చేసరికి ఇల్లు, బీరువా తాళాలు పగులగొట్టి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించిన జనార్దనాచారి పోలీసులకు సమాచారం ఇవ్వగా క్లూస్ టీం బృందం చేరుకుని వేలిముద్రలు సేకరించింది.

రూ.60వేల విలువైన ఫోన్లు చోరీ

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని కాకర్లపల్లిరోడ్డులో ఉన్న సురేష్ సెల్‌ఫోన్ షాప్‌లో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. దుండగులు షాప్‌లోని రూ.60వేలు విలువైన సెల్‌ఫోన్లు ఎత్తుకెళ్లారని షాపు యజమాని వెల్లడించారు.

జిల్లాకు జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు

ఖమ్మంమయూరిసెంటర్: రెండు రోజుల పర్యటనలో భాగంగా జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు అనంత నాయక్ సోమవారం ఖమ్మం వచ్చారు. ఈ సందర్భంగా ఆయనను కలెక్టర్ వీ.పీ.గౌతమ్, సీపీ విష్ణు ఎస్.వారియర్, భద్రాచలం ఐటీడీఏ పీఓ గౌతమ్ పోట్రు మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక ఎన్నెస్పీ గెస్ట్‌హౌజ్‌లో ఆయనను కలిసిన వారు పుష్పగుచ్ఛాలు అందజేశారు.





అనంతనాయక్‌ను పుష్పగుచ్ఛం ఇస్తున్న కలెక్టర్ గౌతమ్, పోలీసు కమిషనర్ విష్ణు ఎస్.వారియర్

సంత గుడి కమిటీ ప్రమాణ స్వీకారం



నూతన పాలకవర్గంతో ఎమ్మెల్యే రాములునాయక్

కారేపల్లి: కారేపల్లిలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం(సంత గుడి) పాలకవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈమేరకు చైర్మన్‌గా కారేపల్లికి చెందిన అడ్డగోడ ఐలయ్య, సభ్యులతో దేవాదాయ ధర్మదాయ శాఖ ఖమ్మం డివిజనల్ ఇన్‌స్పెక్టర్ ఆర్.సమత ప్రమాణ స్వీకారం చేయించారు. సభ్యులు ఈసం కృష్ణవేణి, చింతా సుజాత, మంగీలాల్, సోమందుల రాములు, ఏపె జనార్దన్, నాగండ్ల సీతయ్య, ఎక్స్ అఫీషియో సభ్యులుగా అర్చకుడు బి.శ్రీనివాసాచారి ప్రమాణ స్వీకారం చేయగా, వైరా ఎమ్మెల్యే రాములు నాయక్ ముఖ్యఅతిథి పాల్గొని మాట్లాడారు. సంతగుడిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు నూతన పాలకవర్గం కృషి చేయాలని, ఇందుకు తాను సంపూర్ణ సహకార అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మాలోతు శకుంతల, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు పెద్దబోయిన ఉమా శంకర్, వైస్ ఎంపీపీ రావూరి శ్రీనివాస రావుతో పాటు తోటకూరి రాంబాబు, పద్మావతి, అజ్మీరా వీరన్న, పిల్లి వెంకటేశ్వర్లు, వాంకుడోతు నరేష్, బానోతు కుమార్, జూపల్లి రాము, షేక్ మున్నీరుద్దీన్, సాదిక్ అలీ, కె.నాగేశ్వరరావు, మేదరి టోనీవీరప్రతాప్, పగడాల మోహన్‌కృష్ణ పాల్గొన్నారు.

ఉరి వేసుకుని హార్వెస్టర్ యజమాని ఆత్మహత్య

స్వగ్రామంలో మృతదేహంతో ఆందోళన



ఉపేందర్ (ఫైల్)

భూదాన్‌పోచంపల్లి/కూసుమంచి: కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైన ఓ హార్వెస్టర్ యజమాని బలవన్మరణానికి పాల్పడ్డాడు. యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలంలో ఈ ఘటన జరిగింది. ఖమ్మం జిల్లా కుసుమంచి మండలం నర్సింహులగూడెంకు చెందిన హార్వెస్టర్ యజమాని, ఆపరేటర్ శీలం ఉపేందర్(33) వరికోతలు కోయడానికి పదిహేను రోజుల క్రితం ఇంకో డ్రైవర్ షేక్ మస్తాన్‌ను తీసుకొని భూదాన్‌పోచంపల్లి మండలం పిలాయిపల్లి వెళ్లాడు. అక్కడ గది అద్దెకు తీసుకొని ఉంటుండగా, ఆదివారం ఉదయం ఓ రైతు వరిచేను కోయడానికి వెళ్లారు. మధ్యాహ్నం ఉపేందర్‌కు ఫోన్ రావడంతో గదికి వెళ్లి భోజనం చేసి, వచ్చేటప్పుడు డ్రైవర్‌కు తీసుకొస్తానని చెప్పి వెళ్లాడు. సాయంత్రం నాలుగు గంటలైనా రాకపోయే సరికి మస్తాన్ రూమ్ వద్దకు వెళ్లగా లోపలినుంచి గడియపెట్టుకొని ఉండటంతో కిటికీలో నుంచి చూడగా ఉపేందర్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించాడు. దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వగా చేరుకుని వివరాలు ఆరా తీశారు. కాగా, పోస్టుమార్టం అనంతరం ఉపేందర్ మృతదేహాన్ని సోమవారం నర్సింహులగూడెం తీసుకురాగా ఉద్రిక్తత నెలకొంది. గ్రామానికి చెందిన మేనమామ దాసరి వెంకన్న తన తల్లికి భూమి విషయంలో వేధిస్తున్నాడని, ఇద్దరి నడుమ కొద్దిరోజుల క్రితం ఫోన్‌లో ఘర్షణ కూడా జరిగిందని కుటుంబీకులు ఆరోపించారు. దీంతో మనస్తాపానికి గురైన ఉపేందర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడని చెబుతూ మృతదేహాన్ని మేనమామ ఇంటి వద్ద ఉంచి ఆందోళనకు దిగారు. దీంతో ఉద్రిక్తత నెలకొనగా కూసుమంచి, తిరుమలాయపాలెం ఎస్సైలు రమేష్‌కుమార్, శ్రీనివాస్ చేరుకుని బందోబసు నిర్వహించారు. పోలీసులు, గ్రామపెద్దలు జోక్యం చేసుకుని మృతుడి కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వటంతో వారు ఆందోళన విరమించారు. కాగా, ఉపేందర్‌కు భార్య రేణుక, ఇద్దరు పిల్లలు ఉన్నారు.



వెంకన్న ఇంటి ఎదుట ఆందోళనకు దిగిన బంధువులు

డబుల్ బెడ్‌రూం కేసులో ఇద్దరి అరెస్ట్

పోలీసుస్టేషన్ ఎదుట బాధితుల ఆందోళన



బాధితులతో మాట్లాడుతున్న పోలీసులు

ఖమ్మంక్రైం: డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇప్పిస్తామని రూ.కోట్లలో వసూలు చేసి తప్పించుకు తిరుగుతున్న ఇద్దరు మహిళలను సోమవారం రాత్రి ఖమ్మం టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఖమ్మం ఖిల్లాబజార్‌కు చెందిన అంగన్‌వాడీ టీచర్ షేక్ షకీనా, బోలోపల్లి లక్ష్మి డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇప్పిస్తామని చెప్పి పలువురి రూ.కోట్లలో వసూలు చేసి కానరాకుండా పోయారు. దీంతో బాధితుల ఫిర్యాదు మేరకు పలు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. ఇందులో భాగంగా బోడ దేవేందర్ చేసిన ఫిర్యాదు మేరకు టూ టౌన్ పోలీసులు కూడా గత ఏడాది కేసు నమోదు చేశారు. ఈమేరకు షకీనా, లక్ష్మిని అరెస్ట్ చేసినట్లు తెలియడంతో బాధితులు పెద్దసంఖ్యలో టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. తమ డబ్బు తిరిగి ఇప్పించి న్యాయం చేయాలంటూ కాసేపు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా టూ టౌన్ సీఐ శ్రీధర్, సిబ్బంది వారికి న్యాయం జరిగేలా చూస్తామని నచ్చచెప్పారు. అనంతరం షకీనా, లక్ష్మిని రిమాండ్‌కు తరలించారు.

వేధింపులతో వివాహిత ఆత్మహత్య

కల్లూరు రూరల్: మండలంలోని చెన్నూరు గ్రామపంచాయితీ పరిధి రావికంపాడుకు చెందిన వివాహిత సోమవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గ్రామానికి చెందిన పల్లెబోయిన కుమారి(25)ని అదే గ్రామానికి చెందిన లింగబోయిన నాగరాజు వేధిస్తుండడంతో మానసిక ఒత్తిడికి గురైంది. ఈమేరకు బాత్‌రూం స్లాబ్‌కు ఉరి వేసుకోగా, ఆమె కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

జ్యూస్ పాయింట్ వద్ద ఘర్షణ

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని ఓ జ్యూస్ పాయింట్ వద్ద సోమవారం రాత్రి ఘర్షణ చోటు చేసుకుంది. ఓ జ్యూస్ పాయింట్ వద్దకు నేలకొండపల్లికి చెందిన నరేష్ రాగా, జ్యూస్ పార్సిల్ సమయాన కవర్ ఇవ్వాలని కోరడంతో గొడవ జరిగింది. నిర్వాహకుడు ఐస్ పగలగొట్టే పెద్ద కర్రతో దాడికి యత్నించగా స్థానికులు అడ్డుకున్నారు. అనంతరం పోలీసులు చేరుకుని జ్యూస్ పాయింట్ నిర్వాహకుడు, వాహనాన్ని అదుపులోకి తీసుకున్నారు.

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

ఖమ్మంఅర్బన్: రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనపై సోమవారం ఖమ్మం అర్బన్ స్టేషన్‌లో కేసు నమోదైయింది. బల్లేపల్లికి చెందిన గుగులోత్ మత్రు ద్విచక్ర వాహనంపై ఈనెల 11న రఘునాథపాలెం వైపు వెళ్తుండగా ఎదురుగా వచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో మత్రు గాయపడగా ఆయన బంధువులు సోమవారం ఫిర్యాదు చేశారు.


రోడ్డు ప్రమాదంలో బ్యాంకు ఉద్యోగి మృతి



ఘటనాస్థలంలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

రామగిరి(నల్లగొండ): రోడ్డు ప్రమాదంలో ఓ ప్రైవేట్ బ్యాంకు ఉద్యోగి మృతి చెందాడు. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం రఘునాథపాలెంకు చెందిన కామల్ల వెంకటేష్ (35) నల్లగొండలోని ఓ ప్రైవేట్ బ్యాంకులో ఉద్యోగం చేస్తుండగా మూడు రోజుల క్రితం బంధువుల అంత్యక్రియల కోసం స్వస్థలానికి వెళ్లాడు. తిరిగి సోమవారం బైక్‌పై నల్లగొండకు వస్తుండగా మార్గమధ్యలో తిప్పర్తి మండలం పెద్దసూరారం సమీపాన నల్లగొండ నుంచి నకిరేకల్ వైపునకు వెళ్తున్న కారు ఢీకొట్టడంతో వెంకటేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆయనను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. ఆయనకు భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. వెంకటేష్ సోదరుడు మురళి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

వడదెబ్బతో వృద్ధురాలు...



ముత్తమ్మ(ఫైల్)

ఖమ్మం రూరల్: మండలంలోని గొల్లగూడెం గ్రామానికి చెందిన సీపీఐ సీనియర్ నాయకురాలు సత్తి ముత్తమ్మ(70) సోమవారం వడదెబ్బతో మృతి చెందింది. రెండు రోజులుగా తీవ్రమైన వడగాల్పులతో ఇంట్లో ఉన్న ముత్తమ్మ అస్వస్థతకు గురై కన్నుమూసింది. సీపీఐ నాయకులు మిడికంటి చిన్న వెంకటరెడ్డి, వెంపటి సురేందర్, సాదిక్ అలీ తదితరులు ఆమె మృతదేహం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

సబ్ స్టేషన్లలో ఎల్‌వీ బ్రేకర్ల ట్రిప్

పాల్వంచ: నార్త్ గ్రిడ్‌లో ఏర్పడిన సాంకేతిక సమస్య కారణంగా సోమవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న పలు ట్రాన్స్‌కో 220 కేవీ సబ్ స్టేషన్లలో ఎల్‌వీ బ్రేకర్లు ట్రిప్ అయ్యాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం వాటిల్లింది. పాల్వంచ సీతారాం పట్నం, ఖమ్మం, కొత్తగూడెం, మణుగూరు తదితర సబ్ స్టేషరన్లలో ఉదయం 11.52 నిమిషాలకు ఎల్‌వీ బ్రేకర్లు ట్రిప్ అయ్యాయి. దీంతో మరమ్మతులు చేసి అర్ధగంటలో విద్యుత్ సరఫరా పునరుద్ధరించినట్లు పాల్వంచ ట్రాన్స్‌కో సబ్ స్టేషన్ ఏఈ వెంకటేశ్వరరావు తెలిపారు. కాగా పాల్వంచ సబ్ స్టేషన్‌లో సమస్య తలెత్తడంతో కొత్తగూడెం, పాల్వంచ, ములకపల్లి, బూర్గంపాడు, అంకంపాలెం తదితర చుట్టుపక్కల మండలాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

మలుపు తిప్పిన ముఠా!

చంద్రబాబు బృందం చెప్పినట్టుగానే ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్

సాక్షి, అమరావతి: అమరావతి ముసుగులో నారా చంద్రబాబునాయుడు సాగించిన భూదందాలో ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ అంశం ఓ అవినీతి అధ్యాయమేనని వెల్లడైంది. అలైన్‌మెంట్ ప్రతి మెలికలోనూ పచ్చ గ్యాంగ్ అవినీతి గుట్టు రట్టవుతోంది. టీడీపీ హయాంలో సీఆర్‌డీఏ చైర్మన్‌గా ఉన్న చంద్రబాబు, వైస్ చైర్మన్ పొంగూరు నారాయణ అవినీతి బాగోతాలు విస్తుపోయే రీతిలో ఉన్నాయి. చంద్రబాబు సన్నిహితుడైన లింగమనేని రమేష్ భూముల మార్కెట్ విలువ రూ.177.50 కోట్ల నుంచి వెంటనే రూ.877.50 కోట్లకు... రాజధాని నిర్మాణం అనంతరం ఏకంగా రూ.2,130 కోట్లకు చేరేలా ఇన్నర్‌రింగ్ రోడ్ అలైన్‌మెంట్‌ను ఖరారు చేయడం ఎల్లో గ్యాంగ్ బరి తెగింపు వ్యవహారాలకు నిదర్శనంగా నిలుస్తోంది. ఈ అవినీతి పాపంలో చంద్రబాబు తన దత్తపుత్రుడు పవన్ కల్యాణ్‌కు కూడా పిడికెడు వాటా ఇవ్వడం కొసమెరుపు. అవినీతికి బాటలు వేసిన ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ వెనుక సాగిన గూడుపుఠాణీ దశలవారీగా ఇదిగో ఇలా సాగింది..!

అలైన్‌మెంట్‌ను ఆనుకుని భూములు

ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను మెలికలు తిప్పడం ద్వారా హెరిటేజ్ ఫుడ్స్, లింగమనేని రమేశ్ కుటుంబానికి చెందిన భూముల విలువ భారీగా పెరిగింది. కంతేరు, కాజాలో లింగమనేని కుటుంబానికి 355 ఎకరాలున్నాయి. మొదట రూపొందించిన అలైన్‌మెంట్ ప్రకారం ఆ భూములకు 3 కి.మీ. దూరంగా ఇన్నర్‌రింగ్ రోడ్డు నిర్మించాలి. అలైన్‌మెంట్ మార్పుతో ఆ భూములను ఆనుకుని ఉండేలా ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ ఖరారు చేశారు. ఆ ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను ఆనుకునే హెరిటేజ్ ఫుడ్స్‌కు చెందిన 9 ఎకరాలు ఒకచోట, ఒప్పందం చేసుకున్న నాలుగు ఎకరాలు మరో చోట ఉండటం గమనార్హం.

అమాంతం పెరిగిన విలువ

ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ ఖరారుకు ముందు లింగమనేని కుటుంబం ఆ ప్రాంతంలో ఎకరా భూమి రూ.8 లక్షల రిజిస్టర్ విలువ చొప్పున విక్రయించింది. మార్కెట్ ధర ప్రకారం ఎకరా రూ.50 లక్షలు ఉంది. అంటే ఆ భూముల మార్కెట్ విలువ రూ.177.50 కోట్లు. ఇక ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ ఖరారు తరువాత ఎకరం రూ.36 లక్షల రిజిస్టర్ విలువ చొప్పున విక్రయించింది. అంటే రిజిస్టర్ విలువే నాలుగున్నర రెట్లకుపైగా పెరిగింది. మార్కెట్ ధర ప్రకారం ఎకరా రూ.2.50 కోట్లు పలికింది. అంటే 355 ఎకరాల విలువ మార్కెట్ ధర ప్రకారం అమాంతంగా రూ.887.50 కోట్లకు పెరిగింది. అమరావతి నిర్మాణం పూర్తయితే సీడ్ క్యాపిటల్ ప్రాంతంలో ఎకరా విలువ రూ.4 కోట్లకు చేరుతుందని నాడు ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబే ప్రకటించారు. ఇన్నర్ రింగ్ రోడ్డును ఆనుకుని ఉన్న భూముల విలువ ఎకరా రూ.6 కోట్లకు చేరుతుందని అంచనా వేశారు. అంటే అమరావతి నిర్మాణం పూర్తయితే ఆ 355 ఎకరాల విలువ ఏకంగా రూ.2,130 కోట్లకు చేరుతుందని అంచనా. ఆ ప్రకారం మార్కెట్ ధరను బట్టి హెరిటేజ్ ఫుడ్స్ 9 ఎకరాల విలువ రూ.4.50 కోట్ల నుంచి రూ.22.50 కోట్లకు పెరిగింది. అమరావతి నిర్మాణం పూర్తయితే రూ.54 కోట్లకు చేరుతుందని తేలింది. హెరిటేజ్ ఫుడ్స్ ఒప్పందం చేసుకున్న మరో నాలుగు ఎకరాల విలువ కూడా రూ.24 కోట్లకు చేరుతుంది.

అక్కడే పవన్ కల్యాణ్‌కు 2.40 ఎకరాలు

జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు కూడా ఈ ఇన్నర్‌రింగ్ రోడ్డు అవినీతి పాపంలో చంద్రబాబు పిడికెడు వాటా ఇచ్చారు. కాజాకు సమీపంలో ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌కు సమీపంలోనే పవన్‌కల్యాణ్‌కు 2.4 ఎకరాలున్నాయి. లింగమనేని కుటుంబం నుంచి ఆ భూములను ప్రభుత్వ ధర ప్రకారం ఎకరా రూ.8 లక్షలు చొప్పున కొనుగోలు చేసినట్లు చూపించారు. ల్యాండ్ పూలింగ్ నుంచి మినహాయింపు కల్పించిన భూమినే పవన్ కల్యాణ్‌కు ఇవ్వడం గమనార్హం.

కృష్ణా ఇవతలా అవినీతి మెలికలే

అమరావతి పరిధిలో ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ ద్వారా చంద్రబాబు, లింగమనేని కుటుంబాల భూముల విలువ అమాంతం పెంచుకోగా కృష్ణానదికి ఇవతల విజయవాడ శివారులో నారాయణ తమ ఆస్తుల విలువ భారీగా పెంచుకున్నారు. సీఆర్‌డీఏ అధికారులు మొదట రూపొందించిన అలైన్‌మెంట్ ప్రకారం ఇన్నర్‌రింగ్ రోడ్డును గుంటూరు జిల్లాలోని అమరావతి నుంచి కృష్ణా జిల్లాలోని నున్న మీదుగా నిర్మించాల్సి ఉంది. అందుకోసం కృష్ణా నదిపై వంతెన నిర్మిస్తారు. గుంటూరు జిల్లాలోని నూతక్కి – కృష్ణా జిల్లా పెద్దపులిపర్రు మధ్య కృష్ణా నదిపై వంతెన నిర్మించి అక్కడ నుంచి తాడిగడప నుంచి ఎనికేపాడు మీదుగా నున్న వరకు ఇన్నర్‌రింగ్ రోడ్డు కొనసాగుతుంది. అయితే అలా నిర్మిస్తే నారాయణ విద్యా సంస్థల భవనాలను భూసేకరణ కింద తొలగించాల్సి వస్తుంది. ఈ అలైన్‌మెంట్‌పై నారాయణ నాడు సీఆర్‌డీఏ అధికారులపై తీవ్రస్థాయిలో ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. సీఆర్‌డీఏ సమావేశంలో అధికారులను పరుష పదజాలంతో దూషిస్తూ అలైన్‌మెంట్‌ను మార్చాలని ఆదేశించారు. దాంతో ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను 3 కి.మీ. తూర్పు దిశగా మార్చారు. ఆ ప్రకారం గుంటూరు జిల్లాలో రామచంద్రాపురం – కృష్ణా జిల్లా చోడవరం మధ్య వంతెన నిర్మించాలని ప్రతిపాదించారు. అక్కడ నుంచి పెనమలూరు మీదుగా నిడమానూరు నుంచి నున్న వరకు ఇన్నర్‌రింగ్ రోడ్డును నిర్మిస్తారు. నారాయణ కుటుంబానికి చెందిన 9 విద్యా సంస్థల భవనాలను ఆనుకుని ఉండేలా ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను ఖరారు చేశారు. తన విద్యా సంస్థల భూముల విలువ అమాంతం పెరిగేలా నారాయణ చక్రం తిప్పారు.

అటూ ఇటూ భారీగా కొనుగోలు


ఇన్నర్‌రింగ్ రోడ్డును ఎలా నిర్మించనున్నారో ముందుగానే తెలిసిన బాబు, నారాయణ తమ కుటుంబ సంస్థలు హెరిటేజ్, రామకృష్ణ హౌసింగ్ లిమిటెడ్‌లతోపాటు తమ బినామీ లింగమనేని రమేష్ తన సంస్థల పేరిట భారీగా భూములు కొన్నారు. అవన్నీ ప్రతిపాదిత ఇన్నర్‌రింగ్ రోడ్డుకు అటూ ఇటూ ఉండటం గమనార్హం. సీఐడీ అధికారులు మంగళగిరి, పెదకాకాని, తాడికొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో భూముల రిజిస్ట్రేషన్లను పరిశీలించగా ఈ విషయం స్పష్టమైంది.



అమరావతి ఇన్నర్‌రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్‌లో మార్పులు
వయొలెట్ కలర్: సీఆర్‌డీఏ అధికారులు మొదట రూపొందించిన అలైన్‌మెంట్
బ్లాక్ కలర్ : చంద్రబాబు ఆదేశాలతో మారిన అలైన్‌మెంట్. హెరిటేజ్ ఫుడ్స్, లింగమనేని భూములను అనుకొని రూపొందించిన అలైన్‌మెంట్
రెడ్ కలర్ : ఎస్‌టీయూపీ కన్సల్టెన్సీ ఖరారు చేసిన అలైన్‌మెంట్. హెరిటేజ్ ఫుడ్స్, లింగమనేని భూములను అనుకొని ఖరారు చేసిన అలైన్‌మెంట్.(మార్కింగ్ చేసిన భూములే హెరిటేజ్ ఫుడ్స్, లింగమనేని కుటుంబాలకు చెందినవి)

అలైన్‌మెంట్ 1
సీఆర్‌డీఏ తొలుత రూపొందించింది

అమరావతి ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ నిర్ణయించేందుకు టెండర్ల ద్వారా కన్సల్టెన్సీతో నిమిత్తం లేకుండా పని ముగించాలని చంద్రబాబు, నారాయణ నిర్ణయించారు. దీంతో సీఆర్‌డీఏ అధికారులు 94 కి.మీ. పొడవుతో అమరావతి ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను రూపొందించారు. దీన్ని చూసి చంద్రబాబు, నారాయణ మండిపడ్డారు. ఎందుకంటే దాని ప్రకారం ఇన్నర్‌రింగ్ రోడ్డు పెదపరిమి, నిడమర్రు, చినవడ్లపూడి, పెదవడ్లపూడి మీదుగా వెళ్తుంది. చంద్రబాబు కుటుంబానికి చెందిన హెరిటేజ్ ఫుడ్స్, లింగమనేని కుటుంబానికి చెందిన భూములకు 3 కి.మీ. దూరం నుంచి ఇన్నర్‌రింగ్ రోడ్డు నిర్మించాల్సి వస్తుంది. దీంతో తమ భూముల విలువ అమాంతం పెంచుకునేందుకు ఆ అలైన్‌మెంట్‌ను మార్చాలని ఆదేశించారు.




రెడ్ కలర్ : గుంటూరు, కృష్ణాజిల్లాలను కలుపుతూ కృష్ణానది మీదుగా సీఆర్‌డీఏ అధికారులు ఖరారు చేసిన ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్
గ్రీన్ కలర్ : నారాయణ ఆదేశాలతో కృష్ణా, గుంటూరు జిల్లాలను అనుసంధానిస్తూ ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌లో చేసిన మార్పులు

అలైన్‌మెంట్ 2
చంద్రబాబు ఆదేశాలతో రూపొందించారు

గత సర్కారు పెద్దల ఆదేశాలతో సీఆర్‌డీఏ అధికారులు ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌లో కీలక మార్పులు చేశారు. చంద్రబాబు, లింగమనేని కుటుంబానికి చెందిన వందలాది ఎకరాలున్న తాడికొండ, కంతేరు, కాజా ప్రాంతాలను పరిగణలోకి తీసుకుంటూ ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను 3 కి.మీ. దక్షిణానికి జరిపారు. హెరిటేజ్ ఫుడ్స్, లింగమనేని కుటుంబానికి కంతేరు, కాజాలో ఉన్న భూములను ఆనుకుని మరీ ఇన్నర్‌రింగ్ రోడ్డు నిర్మించేలా 97.50 కి.మీ. మేర అలైన్‌మెంట్‌ను రూపొందించారు. ఆ విషయాన్ని గోప్యంగా ఉంచారు.

అలైన్‌మెంట్ 3
కన్సల్టెన్సీ ద్వారా ఆమోదించింది

సింగపూర్‌కు చెందిన సుర్బాన జ్యురాంగ్ కన్సల్టెన్సీ ద్వారా రూపొందించిన అమరావతి మాస్టర్‌ప్లాన్‌లోనే ప్రతిపాదిత ఇన్నర్‌రింగ్ రోడ్ డిజైన్‌ను చంద్రబాబు ప్రభుత్వం ముందుగానే చేర్చింది. అంటే అప్పటికే ఇన్నర్‌రింగ్ రోడ్ అలైన్‌మెంట్ ఎలా ఉండాలన్నది నిర్ధారణ అయిపోయింది. అనంతరం ఇన్నర్‌రింగ్ రోడ్ అలైన్‌మెంట్‌ను రూపొందించేందుకు ఎస్టీయూపీ అనే ఓ కన్సల్టెన్సీని నియమించారు. మాస్టర్‌ప్లాన్‌లో పొందుపరిచిన అలైన్‌మెంట్‌కు అనుగుణంగానే అది ఉండాలని నిర్దేశించారు. అప్పటికే సీఆర్‌డీఏ ద్వారా తాము ఖరారు చేసిన అలైన్‌మెంట్‌నే ఎస్టీయూపీ కన్సల్టెన్సీ ద్వారా తెరపైకి తెచ్చి ఆమోదించారు. తాడికొండ, కంతేరు, కాజాలో హెరిటేజ్ ఫుడ్స్, లింగమనేని భూములను ఆనుకునే అలైన్‌మెంట్‌ను ఎస్టీయూపీ కన్సల్టెన్సీ ఖరారు చేసింది.



అమరావతి ఇన్నర్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్‌లో మార్పులు

వయొలెట్ కలర్ : సీఆర్‌డీఏ అధికారులు మొదట రూపొందించిన అలైన్‌మెంట్
బ్లాక్ కలర్ : చంద్రబాబు ఆదేశాలతో మారిన అలైన్‌మెంట్. హెరిటేజ్ ఫుడ్స్, లింగమనేని భూములను అనుకొని రూపొందించిన అలైన్‌మెంట్
రెడ్ కలర్ : ఎస్‌టీయూపీ కన్సల్టెన్సీ ఖరారు చేసిన అలైన్‌మెంట్. హెరిటేజ్ ఫుడ్స్, లింగమనేని భూములను అనుకొని ఖరారు చేసిన అలైన్‌మెంట్. (మార్కింగ్ చేసిన భూములే హెరిటేజ్ ఫుడ్స్, లింగమనేని కుటుంబాలకు చెందినవి)

జిల్లా వార్తలు

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంఅర్బన్: భద్రాదికొత్తగూడెం జిల్లా పాలవ్వంచలోని ఒకేషనల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్, మహిళా సాధికార కేంద్రంలో నిరుద్యోగ యువతకు వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఖమ్మం జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ కె.అజయ్‌కుమార్ తెలిపారు. పురుషులకు వెల్డింగ్, ఫిట్టర్, ద్విచక్ర వాహనాల సర్వీసింగ్, ఏసీ మెకానిజం, మహిళలకు టైలరింగ్, బ్యూటీషియన్, రెడీమేడ్ దుస్తులు, జ్యూట్ బ్యాగులు, శానిటరీ నాప్కిన్లు, తాటాకులతో కళాకృతుల తయారీపైనే కాక డీటీపీ, ట్యాలీ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి లేదా ఐటీఐ ఉత్తీర్ణులై 18 నుండి 25ఏళ్ల లోపు వారు అర్హులని, శిక్షణ కాలంలో ఉపకార వేతనం కూడా అందుతుందని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు వివరాల కోసం 80969 99384, 73869 82866 నంబర్లలో సంప్రదించాలని జీఎం సూచించారు.

బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తులు

భద్రాచలంఅర్బన్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని మూడు బెస్ట్ అవైలబుల్ స్కూళ్లలో మూడు, ఐదు, ఎనిమిదో తరగతి(ఇంగ్లిష్ మీడియం)లో గిరిజన సంక్షేమ శాఖ ద్వారా గిరిజన విద్యార్థులకు సీట్లు కేటాయించనుండగా, అర్హులు దరఖాస్తు చేసుకోవాలని భద్రాచలం ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు ఓ ప్రకటనలో సూచించారు. మూడో తరగతిలో 57, ఐదో తరగతిలో 29, 8వ తరగతిలో 29 సీట్ల చొప్పున మొత్తం 115 సీట్లు ఉన్నాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల వారైతే తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.1,50లక్షలు, పట్టణ ప్రాంతాల వారైతే రూ.2లక్షలు దాటని వారు అర్హులని, కులం, ఆదాయం, నివాసం, జనన ధ్రువీకరణ పత్రాలు, స్టడీ సర్టిఫికెట్‌తో వచ్చే నెల 2వ తేదీలోగా ఐటీడీఏలోని గిరిజన సంక్షేమ శాఖ డీడీ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. వచ్చేనెల 7న నిర్వహించే లాటరీ ద్వారా విద్యార్థులను ఎంపిక చేసి అదేనెల 15న కౌన్సెలింగ్ నిర్వహిస్తామని పీఓ తెలిపారు.

ఖమ్మం జిల్లాలో 90సీట్లు

ఖమ్మంమయూరిసెంటర్: బెస్ట్ అవైలబుల్ పథకం(బీఏఎస్) ద్వారా ఖమ్మం జిల్లా గిరిజన విద్యార్థులకు 3, 5, 8 తరగతుల్లో ప్రవేశాలు కల్పించనుండగా ఆసక్తి కలిగిన వారి నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గిరిజన అభివృద్ధి అధికారి కృష్ణానాయక్ తెలిపారు. జిల్లాలో ఈ పథకం ద్వారా 3వ తరగతిలో 45, 5తరగతిలో 23, 8వ తరగతిలో 22 సీట్లు ఉన్నాయని, ఆసక్తి ఉన్న వారు వచ్చేనెల 2వ తేదీలోగా కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటే, 7వ తేదీన లాటరీ ద్వారా ఎంపిక చేస్తామని వెల్లడించారు.

నేటి నుంచి 'దోస్త్' రిజిస్ట్రేషన్లు



ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాలలో దోస్త్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ జకీరుల్లా, అధ్యాపకులు

- డిగ్రీలో ప్రవేశానికి దరఖాస్తుకు అవకాశం
- మూడు విడతల్లో రిజిస్ట్రేషన్లు, ప్రవేశాలు

ఖమ్మంసహకారనగర్: ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులకు డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు కల్పించే ప్రక్రియ మంగళవారం నుంచి మొదలుకానుంది. ఈ మేరకు రాష్ట్రప్రభుత్వం దోస్త్(డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్, తెలంగాణ) షెడ్యూల్‌ను తాజాగా విడుదల చేసింది. ఇందులో భాగంగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ మంగళవారం ప్రారంభమవుతుంది. డిగ్రీలో బీఏ, బీఎస్సీ, బీకాం, బీబీఏ, బీసీఏ, బీబీఎం తదితర కోర్సుల్లో చేరాలనుకునే విద్యార్థులు ఈ వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ప్రవేశాల ప్రక్రియ మూడు విడతల్లో కొనసాగుతుంది. కాగా, ఖమ్మం జిల్లాలో ఐదు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, 30 వరకు ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. ఖమ్మం నగరంలో ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలతో పాటు సత్తుపల్లి, నేలకొండపల్లి, మధిరలలోని డిగ్రీ కళాశాలలున్నాయి. ఇప్పటివరకు జిల్లాలోని ఐదు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 3,240 సీట్లు ఉండగా.. వెబ్ ఆప్షన్ల సమయానికి సీట్లు పెరుగుతాయా .. తగ్గుతాయా అనే అంశంపై స్పష్టత రానున్నది.

దోస్త్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఇలా...

- తొలి విడత రిజిస్ట్రేషన్ ఈనెల 16 నుంచి వచ్చే నెల 10వ తేదీ వరకు అభ్యర్థులు రూ.200 రుసుంతో దరఖాస్తు చేసుకోవాలి. ఈనెల 20నుంచి వచ్చే నెల(జూన్) 11 తేదీ వరకు వెబ్ ఆప్షన్ల నమోదు, వచ్చే నెల 16వ తేదీన మొదటి విడత డిగ్రీ సీట్ల కేటాయింపు ఉంటుంది. సీట్లు వచ్చిన వారు 16నుంచి 25వ తేదీ వరకు కళాశాల ఫీజు, సీటు రిజర్వేషన్ ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించాలి.
- రెండో విడత ప్రక్రియ రూ.400 రిజిస్ట్రేషన్ ఫీజుతో ఉంటుంది. వచ్చే నెల(జూన్) 16నుంచి 26వ తేదీ వరకు రిజిస్ట్రేషన్లు ఉండగా, 16నుంచి 27వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలి. అదే నెల 30న సీట్ల కేటాయింపు జరగనున్నది. జూలై 1నుంచి 5వ తేదీ వరకు విద్యార్థులు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.
- మూడో విడత ప్రక్రియ జూలై 1నుంచి 5వ తేదీ వరకు జరగనుండగా రూ.400రూపాయల ఫీజు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. జూలై 1నుంచి 6వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు, 10న సీట్ల కేటాయింపు జరుగుతుంది. 10నుంచి 14వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలి. కాగా, మూడు విడతల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేసిన విద్యార్థులంతా జూలై 10నుంచి 15వ తేదీ వరకు ఆయా కళాశాలల్లో రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. జూలై 11న నుంచి 15వ తేదీ వరకు కళాశాలల్లో ఓరియెంటేషన్ కార్యక్రమాలు, అదే నెల 17నుంచి తరగతులు ప్రారంభిస్తారు.

ఏమేం కావాలంటే...

రిజిస్ట్రేషన్ సమయాన విద్యార్థులు ఇంటర్ ద్వితీయ సంవత్సరం హాల్‌టికెట్ నంబర్ అందుబాటులో ఉంచుకోవాలి. అలాగే, ఆధార్‌కార్డు జిరాక్స్, ఆధార్‌కార్డుకు లింక్ అయిన ఫోన్ నంబర్, ఎస్సెస్సీ, ఇంటర్ మెమోలు, ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికెట్ల జిరాక్స్, ఇంటర్ టీసీ, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, పాస్‌పోర్టు సైజ్ ఫొటో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

ఈసారి యాప్ కూడా..

ఉన్నత విద్యాశాఖ ఈ ఏడాది నుంచి దోస్త్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. గతంలో మీ సేవ సెంటర్లు, కళాశాలలోని హెల్ప్‌లైన్ సెంటర్లు, టీ పోలియో యాప్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకునే వారు. ఈసారి యాప్ అందుబాటులోకి తీసుకురావడంతో రిజిస్ట్రేషన్ మరింత సులభం కానుంది.

ఓటీపీలు, పిన్ నంబర్లు ఇతరులకు చెప్పొద్దు...



రిజిస్ట్రేషన్‌ను మరింత సులభం చేసేందుకు దోస్త్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. విద్యార్థులు రిజిస్ట్రేషన్లు చేసుకునే సమయాన తమది లేదంటే తల్లిదండ్రుల ఫోన్ నంబర్ మాత్రమే ఉపయోగించాలి. ఆ నంబర్‌కు వచ్చే ఓటీపీలు, పిన్ నంబర్లు ఇతరులతో పంచుకోవద్దు. రిజిస్ట్రేషన్‌కు ఇచ్చే నంబర్ అడ్మిషన్ ప్రక్రియ ముగిసే వరకు తప్పకుండా ఉండాలి. విద్యార్థులకు సందేహాలు ఉంటే 96663 01229 నంబర్ లేదా ఖమ్మం ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలోని హెల్ప్‌లైన్ సెంటర్‌లో సంప్రదించాలి.
– సుబ్రహ్మణ్యం, దోస్త్ కో ఆర్డినేటర్, ఖమ్మం

రామాలయానికి ట్రాలీ ఆటో బహూకరణ

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానానికి పట్టణంలోని భద్రాద్రి హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ యజమానులు సోమవారం ట్రాలీ ఆటో వితరణగా అందచేశారు. సీఆర్వో క్యాంప్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఏజెన్సీ ప్రతినిధులు ఆలయ ఈఓ రమాదేవికి ఆటో తాళాలను అప్పగించారు. దేవస్థానం పరిధిలో జరిగే కార్యక్రమాలతో పాటుగా ఇతర పనులకు ఆటో ట్రాలీ ఉపయోగపడుతుందని పేర్కొన్న ఈఓ.. ఏజెన్సీ యజమాని దమ్మాలపాటి జానకీరాంను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ భవానీరామకృష్ణ, ఆలయ ప్రధాన అర్చకులు పొడిచేటి జగన్నాథాచార్యులు, ఏజెన్సీ సిబ్బంది వెంకన్న బాబు, అన్వర్‌బాషా, వీరబాబు పాల్గొన్నారు.




ఈఓకు ఆటో తాళాలు అప్పగిస్తున్న ఏజెన్సీ ప్రతినిధులు

ఏఐబీఈఏ సదస్సులో ఉమ్మడి జిల్లా ప్రతినిధులు

ఖమ్మంవ్యవసాయం: ముంబైలో జరిగిన ఆలిండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్(ఏఐబీఈఏ) జాతీయ సదస్సులో ఉమ్మడి ఖమ్మం జిల్లా ఉద్యోగుల సమన్వయ సమితి సభ్యులు పాల్గొన్నారు. శనివారం మొదలైన ఈ సదస్సు సోమవారం ముగిసింది. ఉమ్మడి జిల్లా ప్రతినిధులు నాగేందర్(కేంద్ర సహకార బ్యాంక్), రాజేష్(యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా), శ్రీకాంత్(బ్యాంక్ ఆఫ్ బరోడా) పాల్గొనగా, బ్యాంకు ఉద్యోగుల సమస్యలు, ప్రైవేటీకరణపై చర్చించినట్లు తెలిపారు.

రెండో వారధికి రూపం..



మొదటి బ్రిడ్జికి సమాంతరంగా గ్రెడ్డర్లతో పిల్లర్లు కలిసిన రెండో బ్రిడ్జి

పిల్లర్లకు గ్రెడ్డర్ల అనుసంధానం ప్రక్రియ పూర్తి

భద్రాచలం: తొమ్మిదేళ్లుగా ఆగుతూ.. సాగుతూ నత్తనడక పనులు జరుగుతున్న భద్రాచలం గోదావరిపై రెండో వంతెన ఓ ఆకారానికి వచ్చింది. భద్రాచలం, సారపాక రెండు వైపులా 33 పిల్లర్లను గతంలోనే నిర్మించగా, వాటిని గ్రెడ్డర్లతో అనుసంధానం చేసే ప్రక్రియ సోమవారం పూర్తయింది. ఆ పిల్లర్లను కలుపుతూ ఏర్పాటు చేసిన గ్రెడ్డర్లు ఒక్కటయ్యాయి. దీంతో మొదటి బ్రిడ్జికి సమాంతరంగా రెండో బ్రిడ్జి కనిపిస్తోంది. అయితే ఈ వారధి 12 అడుగుల వెడల్పు ఉండగా ఇరువైపులా నాలుగు అడుగుల ఫుట్‌పాత్ నిర్మాణం, బ్రిడ్జికి రక్షణ గోడతో పాటు , సారపాక, భద్రాచలం రెండు వైపులా అప్రోచ్ రోడ్డు, సీసీ రోడ్డుతో పాటు ఇతర నిర్మాణ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇరువైపులా పిల్లర్లు కలిసిన నేపథ్యంలో ఈ ఏడాది వర్షాకాలం సీజన్‌లో గోదావరి వరద పెరిగినా బ్రిడ్జి పనులకు ఎలాంటి ఆటంకం కలగదని నేషనల్ హైవే అధికారులు చెబుతున్నారు. అన్ని పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రయాణికులకు అందుబాటులోకి తెస్తామని అంటున్నారు. కాగా 2014 అక్టోబర్‌లో శంకుస్థాపన చేసిన ఈ రెండో బ్రిడ్జి ఈ ఏడాది అక్టోబర్ నాటికైనా సిద్ధమైతే రవాణా ఇబ్బందులు తొలగుతాయని ప్రజలు భావిస్తున్నారు.

తిరోగమనం దిశగా బీజేపీ

- వచ్చే నెల 4న కొత్తగూడెంలో భారీ బహిరంగ సభ
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

ఖమ్మంమయూరిసెంటర్/పాల్వంచ: దేశవ్యాప్తంగా బీజేపీ తిరోగమనం ప్రారంభమైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. రాజకీయాలు, మతాన్ని కలిపి లబ్ధి పొందాలని చూసిన బీజేపీకి కర్ణాటక ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని తెలిపారు. ఖమ్మంలోని గిరిప్రసాద్ భవన్, పాల్వంచలోని సీఆర్ భవనంలో సోమవారం జరిగిన జిల్లాల స్థాయి కౌన్సిల్ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. బీజేపీ అధికారాన్ని చేజిక్కించుకునేందుకు దిగజారుడు విధానాలను అవలంబిస్తుందనే విషయాన్ని ప్రజలు అర్థం చేసుకున్నారని తెలిపారు. ఆర్థికంగా దేశాన్ని దివాళా తీయించిన బీజేపీ మతాన్ని అడ్డుపెట్టుకుని ప్రజల మధ్య విభజన తీసుకువచ్చేందుకు యత్నిస్తోందని ఆరోపించారు. కర్ణాటకలో అమిత్‌షా, మోదీల ఎత్తుగడలు, పారాయణాలు పని చేయలేదని.. రానున్న కాలంలో దేశ వ్యాప్తంగా బీజేపీకి ఇదే పరిస్థితి ఎదురవుతుందని చెప్పారు. కాగా, సీపీఐ ఆధ్వర్యాన బీజేపీ కో హఠావో.. దేశ్‌కో బచావో నినాదంతో గ్రామగ్రామాన చేపట్టిన ప్రజాపోరు యాత్రకు విశేష స్పందన లభించిందని వివరించారు. వచ్చే నెల 4న కొత్తగూడెంలో పార్టీ బలాన్ని చాటిచెప్పేలా భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు కూనంనేని తెలిపారు. ఈ సభకు పార్టీ జాతీయ కార్యదర్శి డి.రాజా, జాతీయ నాయకులు కె.నారాయణ, చాడ వెంకటరెడ్డి, అజీజ్ పాషా తదితరులు హాజరవుతారన్నారు. ఈ సమావేశంలో సీపీఐ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు, జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, ఖమ్మం, భద్రాద్రి జిల్లాల కార్యదర్శులు పోటు ప్రసాద్, ఎస్.కే.సాబీర్‌పాషాతో పాటు నాయకులు మహ్మద్ మౌలానా, జమ్ముల జితేందర్‌రెడ్డి, ఎస్.కే.జానీమియా, గోవిందరావు, ఏపూరి లతాదేవి, సిద్ధినేని కర్ణకుమార్, బందెల నర్సయ్య, ముత్యాల విశ్వనాథం, సలీం, వై.శ్రీనివాసరెడ్డి, నరాటి ప్రసాద్, చంద్రగిరి శ్రీనివాసరావు, సలిగంటి శ్రీనివాస్, చంద్ర నరేంద్రకుమార్, భాస్కర్‌రావు, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, అడుసుమల్లి సాయిబాబు, దస్రు, దస్తగిరి, కేశవరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు